పదేళ్లకు ముందు: ఆకతాయిల ఆగడాలు, వారి వికృత చేష్టలు.. ఆ బాధలను ఎవరికి చెప్పుకోవాలో తెలియని పరిస్థితి అతివలది..

ప్రస్తుతం: ధైర్యంగా షీ టీంలకు చెబుతున్నారు. బృందాల్లోని సభ్యులు మఫ్టీల్లో తిరుగుతూ ఆకతాయిల ఆట కట్టిస్తున్నారు. కేసులు పెట్టి కటకటాల్లోకి నెడుతూ మహిళలకు భరోసా ఇస్తున్నారు.

SHE TEAMS
TELANGANA POLICE
Safety for Her Ensured

ఆమె ధైర్యం.. షీ టీం!

పదేళ్లు పూర్తి చేసుకున్న వ్యవస్థ

మహిళల భద్రతే లక్ష్యంగా ప్రభుత్వం 2014 అక్టోబరు 24న అందుబాటులోకి తీసుకొచ్చిన షీటీం వ్యవస్థ పదేళ్లు పూర్తి చేసుకుంది.. ఉమ్మడి వరంగల్ వ్యాప్తంగా ఈ బృందాలు నిరంతరం గస్తీ నిర్వహిస్తూ అతివలకు భరోసా కల్పిస్తున్నాయి. విద్యాసంస్థలు, ప్రజలు ఎక్కువగా గుమ్మిగూడే ప్రాంతాల్లో అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నాయి.

ఈనాడు, మహబూబాబాద్, న్యూస్‌టుడే, వరంగల్ క్రైం

మీకు తెలుసా..

- ఈవ్‌టీజింగ్ చేస్తూ రెండోసారి పట్టుబడితే నిర్భయ చట్టం కింద కేసులను నమోదు చేస్తారు.
- షీటీంలో ఇన్‌స్పెక్టర్, ఎస్సై, ఏఎస్సై, హెచ్‌సీ, మహిళా కానిస్టేబుళ్లు ఉంటారు. వరంగల్ కమిషనరేట్ పరిధిలో సీసీఎస్ ఏసీపీ, మహబూబాబాద్ జిల్లాలో అదనపు ఎస్పీ పర్యవేక్షణలో ఈ బృందాలు పని చేస్తున్నాయి.





గోడపత్రికల ద్వారా ప్రచారం చేస్తున్న షీ బృందం సభ్యులు

నిఘా పెట్టి.. కౌన్సెలింగ్ ఇచ్చి

- ఆరు నెలల కిందట హనుమకొండ పబ్లిక్‌గార్డెన్ సమీపంలో ఆకతాయిలు విద్యార్థినులను వేధిస్తుండడంతో ఓ మహిళ.. షీటీంకు ఫిర్యాదు చేసింది. రంగంలోకి దిగిన బృందం నిఘా పెట్టి వేధింపులకు పాల్పడుతున్న వారిని అదుపులోకి తీసుకుని కౌన్సెలింగ్ ఇచ్చింది.
- మూడు నెలల కిందట వరంగల్ పోచమ్మ మైదానం ప్రాంతంలో బస్సులు నిలిపే స్థలంలో కొంతమంది యువకులు మహిళలు, విద్యార్థినులను వేధిస్తున్నట్లు సమాచారం రావడంతో షీ బృందం మఫ్టీలో ఉండి వారిని పట్టుకుంది.
- మిల్స్ కాలనీ ఠాణా పరిధిలో ఓ మహిళను స్థానికంగా ఉండే యువకులు వేధిస్తుంటే షీ బృందానికి ఫిర్యాదు వెళ్లింది. వారిని కేసు నమోదు చేయించారు.
- హనుమకొండలో దుకాణంలో ఉన్న మహిళను వేధిస్తున్న ఆటో డ్రైవర్‌ను పట్టుకొని కేసు నమోదు చేశారు.

క్యూఆర్ కోడ్‌తో..



ఆకతాయిలతో ఇబ్బందులు ఎదురైనప్పుడు నేరుగా ఫిర్యాదు చేసేందుకు షీ టీంలు 2022లో క్యూఆర్ కోడ్ అందుబాటులోకి తీసుకొచ్చాయి. కళాశాలలు, ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలు, సినిమా థియేటర్లు, ఆర్టీసీ బస్సుల్లో.. ఇలా జనాలు అధికంగా ఉండే ప్రాంతాల్లో క్యూఆర్ కోడ్ పోస్టర్లను అతికించారు. బాధితులు తమ ఫోన్ ద్వారా దానిని స్కాన్ చేయగానే డీజీ ఆఫీసుకు ఫిర్యాదు వెళ్తుంది. వెంటనే దరఖాస్తు ఫారం వస్తుంది. వివరాలు నమోదు చేసి సెండ్ చేసిన వెంటనే జిల్లా షీటీంకు సంక్షిప్త సమాచారం వెళ్తుంది. బృందం అక్కడికి చేరుకుని ఆకతాయిల ఆటకట్టిస్తారు.

- qr.tspolice.gov.in వెబ్‌సైట్‌లోకి వెళ్లి లాగిన్ అయ్యి ఫిర్యాదు చేస్తే సరిపోతుంది.

కేసులు నమోదు ఇలా

	2022	2023	2024
వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో	425	525	342
మహబూబాబాద్ పోలీస్‌శాఖ..	09	47	30

ఫిర్యాదుల సంఖ్య పెరిగింది

- సుజాత, షీ టీం విభాగం ఇన్‌స్పెక్టర్

గతంలో కంటే ప్రస్తుతం ఫిర్యాదుల సంఖ్య పెరిగింది. మహిళలకు ఉన్న చట్టాలు, రక్షణ గురించి కళాశాలలు, పాఠశాలలో షీ బృందం అవగాహన కార్యక్రమాలు చేపడుతోంది. వారికి రక్షణగా ఉంటుంది. ఫిర్యాదు వచ్చిన వెంటనే సిబ్బంది స్పందిస్తారు.

ఫిర్యాదుల కోసం సంప్రదించాల్సిన నెంబర్లు

డయిల్ 100, 112
వరంగల్ కమిషనరేట్ షీ టీం నెంబరు: 87126-85124
మహబూబాబాద్ షీ టీం నెంబరు, వాట్సాప్: 8712656935, 7901142009
- ఫిర్యాదు చేసినవారి వివరాలను గోప్యంగా ఉంచుతారు.

గుడ్, బ్యాడ్ టచ్‌లపై అవగాహన

షీ టీంలు ఉమ్మడి జిల్లాలోని పాఠశాల, కళాశాలల్లో గుడ్, బ్యాడ్ టచ్‌లపై, పోక్సో చట్టంపై విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నాయి. గుడ్, బ్యాడ్ టచ్ అంటే ఏమిటి.. ఏవిధంగా వేధిస్తారో ప్రాక్టికల్‌గా చూపిస్తూ. . ఆ సమయంలో రక్షణ కోసం ఎలా స్పందించాలో బాలికలకు వివరిస్తున్నారు.



మహబూబాబాద్‌లోని బాలికల గురుకుల పాఠశాలలో నిర్వహించిన అవగాహన కార్యక్రమం..

గ్రామీణులకు అందుబాటులో వైద్య సేవలు



మాట్లాడుతున్న జిల్లా వైద్యాధికారి

మహబూబాబాద్‌రూరల్ (గూడూరు) న్యూస్‌టుడే: వైద్య సిబ్బంది నిబద్ధతతో ప్రజలకు వైద్య సేవలు అందేలా చిత్తశుద్ధితో కృషి చేయాలని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి మురళీధర్ సూచించారు. అయోధ్యపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జాతీయ ఆరోగ్య కార్యక్రమాల అమలుపై గురువారం సమీక్ష నిర్వహించారు. ప్రాథమిక వైద్యం, వ్యాధి నివారణ లక్ష్యంగా నీతి అయోగ్ ఇండికేటర్ దృష్టిలో ఉంచుకొని పని చేయాలన్నారు. డాక్టర్ సారంగం, డాక్టర్ సుధీర్ రెడ్డి, వైద్యాధికారి యమున తదితరులున్నారు.

తాగునీటి గోస..!

మహబూబాబాద్, న్యూస్‌టుడే: మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో దశాబ్దం క్రితం ఏర్పాటైన మంద కొమరమ్మ కాలనీ, సమీపంలో ఉన్న భూపతన్న కాలనీలకు మిషన్ భగీరథ నీటి సౌకర్యం లేక తాగునీటి కోసం కాలనీవాసులకు తిప్పలు తప్పడం లేదు. రెండు కాలనీల్లో సుమారు సుమారు 350కి పైగా కుటుంబాలు నివాసం ఉంటున్నాయి. ప్రభుత్వ భూమిలో గుడిసెలు వేసుకొని నివసిస్తున్న ఆ కాలనీవాసులు తమకు నీటి సదుపాయం కల్పించాలంటూ అధికారులు, ప్రజాప్రతినిధులను వేడుకుంటున్నా పట్టించుకోవడం లేదు.



మందకొమరమ్మ కాలనీ, భూపతన్న కాలనీకి తాగునీటి సౌకర్యం కల్పిస్తున్న బావి

వ్యవసాయ బావే దిక్కు

సుమారు 1,500 జనాభా కలిగిన ఈ రెండు ప్రాంతాలకు వ్యవసాయ బావి నీరే దిక్కయింది. ఆ బావి చుట్టూ చిన్న విద్యుత్తు మోటార్లు ఏర్పాటు చేసుకొని సమీప ప్రాంత వాసులు పైపుల ద్వారా నీటిని తీసుకెళుతున్నారు. కొందరు ఇళ్లల్లో చేద బావులు తవ్వుకున్నారు. మరికొందరు చేతి పంపులు ఏర్పాటు చేసుకున్నారు. ఈ నీటిని కాలకృత్యాలకు వినియోగించుకుంటూ తాగేందుకు క్యాన్ల ద్వారా మినరల్ వాటర్‌ను కొనుగోలు చేస్తున్నారు.

మిషన్ భగీరథ నీరు రావడం లేదు:

రావుల రాధమ్మ, మంద కొమరమ్మ కాలనీ



పదేళ్ల నుంచి ఈ కాలనీలో నివసిస్తున్నాం. ఇంతవరకు మిషన్ భగీరథ నీరు రాలేదు. నీటి సౌకర్యం కల్పించాలని అధికారులను కోరితే అక్రమంగా ప్రభుత్వ స్థలంలో ఇళ్లు నిర్మించారంటూ ఇవ్వడం లేదు. గత ప్రభుత్వం తమకకు ఇళ్ల పట్టాలు ఇచ్చింది. ఇప్పటికైనా మిషన్ భగీరథ నీరు సరఫరా చేయాలి.

వ్యవసాయ బావి నీళ్లే దిక్కు..

- సయ్యద్ అనీషా, మంద కొమరమ్మ కాలనీ



తమ కాలనీలో ఉన్న వ్యవసాయ బావి నీటినే వాడుకుంటున్నాం. తాగేందుకు మినరల్ వాటర్ కొంటున్నాం. సమీపంలో గుట్టపైనుంచి మిషన్ భగీరథ నీటిని సరఫరా చేస్తే మా నీటి సమస్య తీరుతుంది.

- పట్టణంలోని శివారు ప్రాంతాలకు మిషన్ భగీరథ పైపుల ద్వారా నీటి సౌకర్యం కల్పించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని పురపాలక కమిషనర్ ఎన్. రవీందర్ తెలిపారు. ఆ కాలనీల్లో నీటి సరఫరాపై పరిశీలిస్తామన్నారు.

కల్తీ విత్తనాలు విక్రయిస్తే కఠినచర్యలు

ఇనుగుర్తి, న్యూస్‌టుడే: కల్తీ విత్తనాలను విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మహబూబాబాద్ డివిజన్ వ్యవసాయ సంచాలకుడు అజ్మీర శ్రీనివాసరావు అన్నారు. గురువారం ఇనుగుర్తిలోని ఎరువులు, పురుగుమందుల దుకాణాలలో తనిఖీలు నిర్వహించి రికార్డులను పరిశీలించారు. చిన్ననాగారం గ్రామంలో పసుపు, మిర్చి, పత్తి పంటలను సందర్శించారు. మండల వ్యవసాయ అధికారి భూక్య మహేందర్, వ్యవసాయ విస్తరణ అధికారి వి. భాస్కర్, రైతులు పాల్గొన్నారు.

కాజీపేట ఆర్వోబీ నిర్మాణమెప్పుడు?

రైల్వే జీఎం సమావేశంలో గళమెత్తిన ఎంపీలు

కాజీపేట, మహబూబాబాద్, కేసముద్రం, న్యూస్‌టుడే: ఓరుగల్లు ఎంపీలు రైల్వే సమస్యలపై గళమెత్తారు.. దక్షిణ మధ్య రైల్వేలో కీలకమైన కాజీపేట జంక్షన్‌తో పాటు ఇతర రైల్వే స్టేషన్లలో నెలకొన్న సమస్యలను రైల్వే అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. అత్యంత కీలకమైన కాజీపేటలో కొత్త రైల్వే వంతెన నిర్మాణం (ఆర్వోబీ) త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు. సికింద్రాబాదు రైలు నిలయంలో గురువారం దక్షిణ మధ్య రైల్వే పరిధిలోని ఎంపీలతో జీఎం అరుణ్‌కుమార్ జైన్ నిర్వహించిన సమావేశంలో ఉమ్మడి వరంగల్ నుంచి కడియం కావ్యతో పాటు మహబూబాబాద్ ఎంపీ బలరాం నాయక్ పాల్గొన్నారు.

వరంగల్ ఎంపీ కావ్య ప్రస్తావించిన అంశాలు..



- వరంగల్ నగరం అభివృద్ధిలో కీలకమైన అసంపూర్తి ఆర్వోబీ నిర్మాణం వెంటనే పూర్తి చేయాలి. వంతెన పనుల జాప్యంలో రాష్ట్ర ప్రభుత్వం వైపు నుంచి ఉన్న ఆటంకాలను తొలగించడానికి కృషి చేస్తాం.. రైల్వేశాఖ తమ వంతు కర్తవ్యాన్ని నిర్వర్తించాలి..
- కాజీపేటను రైల్వే డివిజన్ కేంద్రంగా ప్రకటించాలి
- చింతపల్లి, ధర్మసాగర్ బైపాస్ లైన్ల నిర్మాణంలో రైల్వే శాఖ పునరాలోచించి రైతులకు నష్టం కలగకుండా చూడాలి. కొత్తలైన్ల నిర్మాణంలో రైల్వే స్థానిక రైతులు, అధికారుల సూచనలు తీసుకోకుండా, ప్రజాభిప్రాయం సేకరించకుండా నిర్ణయం తీసుకోవడం సబబు కాదు...
- మ్యానుప్యాక్చరింగ్ యూనిట్‌ను కోచ్ ఫ్యాక్టరీగా అప్‌గ్రేడ్ చేయడం హర్షణీయం
- కాజీపేట స్టేషన్‌లో అదనపు ప్లాట్‌ఫారాలు, వేచిఉండు గదుల ఆవశ్యకత

మహబూబాబాద్ ఎంపీ బలరాం నాయక్..



- సుదూర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులకు సౌకర్యం కల్పించేందుకు మహబూబాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోని ప్రధాన రైల్వే స్టేషన్లలో వందేభారత్‌తో పాటు సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైళ్లకు హాల్టింగ్ సౌకర్యం ఇవ్వాలి.
- మహబూబాబాద్‌లో గరీబ్‌రథ్, రప్తీసాగర్, గ్రాండ్‌ట్రంక్, ఏపీ ఎక్స్‌ప్రెస్‌ను నిలపాలి.
- కేసముద్రంలో బీదర్ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్, పద్మావతి(అప్), కరీంనగర్ సూపర్‌ఫాస్ట్, సాయినగర్‌షిర్డీ, సాయినగర్ షిర్డీ వీక్లీ రైళ్లను హాల్టింగ్‌ను పునరుద్ధరించాలి. నాగర్‌సోల్, ఇంటర్‌సిటీ రైళ్లను కూడా నిలపాలి.
- డోర్నకల్‌లో పద్మావతి, కోణార్క్, నాగర్‌సోల్ ఎక్స్‌ప్రెస్‌లకు హాల్టింగ్ కల్పించాలి.
- నెక్కొండలో ఇంటర్‌సిటీ, శాతవాహన, చార్మినార్, నవజీవన్, షిరిడీ, కరీంనగర్ ఎక్స్‌ప్రెస్‌లు నిలపాలి. తాళ్లపూసపల్లి గేట్ నెంబర్ 79 సమీపంలో అసంపూర్తిగా మిగిలిన రైల్వే అండర్ పాస్ నిర్మాణ పనులను పూర్తి చేయాలి.

కదిలిన యంత్రాంగం.. పరిసరాలు శుభ్రం



డోర్నకల్‌లో ఎస్సీ హాస్టల్ పరిసరాలను శుభ్రం చేయిస్తున్న అధికారులు

ఈనాడు కథనానికి స్పందన

డోర్నకల్, న్యూస్‌టుడే: 'లోపల దోమలు-బయట పాములు' శీర్షికన 'ఈనాడు'లో ప్రచురితమైన కథనానికి అధికార యంత్రాంగం స్పందించింది. డోర్నకల్‌లోని ఎస్సీ బాలుర వసతి గృహాన్ని పుర కమిషనర్ నరేష్‌రెడ్డి, మండల పరిషత్తు ప్రత్యేక అధికారి నర్సింహమూర్తి, హెల్త్ ఇన్‌స్పెక్టర్ షేక్ మిన్హజ్ అహ్మద్ సందర్శించారు. హాస్టల్‌కు ఆనుకుని పెరిగిన ముళ్ల కంప, పొదలు పరిశీలించారు. వెంటనే సిబ్బందిని రప్పించి పరిసరాలను శుభ్రం చేయించారు. దీర్ఘకాలికంగా తాము ఎదుర్కొంటున్న అవస్థలకు పరిష్కారం చూపిన అధికారులతో పాటు 'ఈనాడు'కు విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు

ప్రైవేటు వాహనాలు రాకుండా కాపలా..!



మహబూబాబాద్ టౌన్, న్యూస్‌టుడే: మానుకోట ఆర్టీసీ ప్రయాణ ప్రాంగణంలోకి ప్రైవేటు వాహనాలు ప్రవేశించవద్దని నిబంధనలున్నప్పటికీ ఆటోలు తిరుగుతున్నాయంటూ 'ఆర్టీసీ ప్రాంగణం.. ఆటోలే అధికం'..! శీర్షికతో బుధవారం 'ఈనాడు'లో ప్రచురితమైన చిత్ర కథనానికి డిపో మేనేజర్ మేడ శివప్రసాద్ స్పందించారు. గురువారం ప్రయాణ ప్రాంగణంలోని ప్రైవేటు వాహనాలు, ఆటోలు రాకుండా సెక్యూరిటీ సిబ్బందిని నియమించారు. ప్రైవేటు వాహనాలు లోనికి వస్తే తగిన చర్యలు తీసుకుంటామన్నారు.

అనిశాకు పట్టుబడ్డ పీఆర్ ఉద్యోగులు



నగదుతో పట్టుబడ్డ ఉద్యోగులు

భూపాలపల్లి కలెక్టరేట్, న్యూస్‌టుడే : జయశంకర్ భూపాలపల్లి జిల్లా పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ ఈఈ దిలీప్‌తో పాటు అసిస్టెంట్ టెక్నికల్ అధికారి చంద్రశేఖర్, సీనియర్ అసిస్టెంట్ శోభారాణి రూ.20 వేల లంచం తీసుకుంటూ గురువారం అనిశాకు చిక్కారు. అనిశా డీఎస్పీ సాంబయ్య తెలిపిన వివరాల ప్రకారం.. మల్హర్‌రావు మండలం తాడిచర్లకు చెందిన సదానందం అనే గుత్తేదారు 2023లో రెండు సీసీ రోడ్ల నిర్మాణానికి సంబంధించి చేసిన పనులకు రూ.10 లక్షలకు గాను 5.23 లక్షలు మంజూరయ్యాయి. తర్వాత ఫైనల్ బిల్ రూ.4.77 లక్షల మంజూరుకు పాస్ ఆర్డర్ ఇచ్చేందుకు పీఆర్ ఈఈ దిలీప్‌కు రూ.10 వేలు, ఇద్దరు సిబ్బందికి రూ.5 వేల చొప్పున లంచం ఇవ్వాలని డిమాండ్ చేశారు. దాదాపు 15 రోజుల నుంచి ఇబ్బంది పెడుతుండగా విసిగి వేసారిన గుత్తేదారు వరంగల్ అనిశా అధికారులను ఆశ్రయించాడు. అనిశా అధికారుల సూచన మేరకు గురువారం సాయంత్రం 5:40 గంటల సమయంలో గుత్తేదారు కలెక్టరేట్‌లోని పీఆర్ ఇంజనీరింగ్ కార్యాలయంలో అధికారులకు డబ్బులు ఇస్తుండగా వెంటనే పట్టుకుని వారి నుంచి నగదు స్వాధీనం చేసుకున్నారు. అరెస్టు చేసిన వారిని శుక్రవారం వరంగల్ ఏసీబీ కోర్టులో హాజరుపర్చనున్నట్లు డీఎస్పీ తెలిపారు. ఏసీబీ ఇన్‌స్పెక్టర్లు శ్యామ్‌సుందర్, ఎల్. రాజు, ఎస్. రాజు పాల్గొన్నారు.

కౌన్సిలర్ల సూచనలతో ఇందిరమ్మ ఇళ్ల కమిటీలు

మహబూబాబాద్, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల కమిటీలను రాజకీయాలకు అతీతంగా వార్డు కౌన్సిలర్ల సూచనలతో ఎంపిక చేయాలని కోరుతూ గురువారం పురపాలక అధ్యక్షుడు డాక్టర్ పాల్వాయి రామ్మోహన్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు మార్నేని వెంకన్న కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్‌కు వినతి పత్రం సమర్పించారు. ఈ మేరకు కౌన్సిలర్లు సూచించిన పేర్లతో కొత్త జాబితాను కలెక్టర్‌కు అందజేశారు.



కలెక్టర్‌కు వినతి పత్రం అందిస్తున్న పురపాలక అధ్యక్షుడు పాల్వాయి రామ్మోహన్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు మార్నేని వెంకన్న

వసతి గృహ నిర్వహణలో నిర్లక్ష్యం వద్దు

దంతాలపల్లి, న్యూస్‌టుడే: వసతి గృహం నిర్వహణలో అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని మండల ప్రత్యేకాధికారి వీరన్న చెప్పారు. దంతాలపల్లిలోని ప్రభుత్వ గిరిజన బాలుర వసతి గృహాన్ని గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థుల వంటకు ప్రభుత్వం కేటాయించిన సరకులను పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలన్నారు. ఉపాధ్యాయులు సమయ పాలన పాటించాలన్నారు. ఆశ్రమ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వీరాసింగ్ తదితరులున్నారు.

సంక్రాంతిలోపు రుణమాఫీ పూర్తి

దంతాలపల్లి, న్యూస్‌టుడే: డిసెంబర్ లేదా సంక్రాంతి నాటికి రైతుల రూ.2 లక్షల రుణమాఫీని పూర్తి చేస్తామని ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే రామచంద్రునాయక్ స్పష్టం చేశారు. దంతాలపల్లి మండలంలో గురువారం ఆయన పర్యటించారు. తొలుత రైతు వేదికలో వివిధ గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేశారు. అనంతరం జడ్పీ ఉన్నత పాఠశాలలో దాతల సహకారంతో పునర్నిర్మించిన మరుగుదొడ్ల బ్లాక్‌ను ఆయన ప్రారంభించారు. తరువాత జరిగిన పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో పాతకొత్త వారంతా కలిసి పార్టీ బలోపేతానికి పాటుపడాలన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల గెలుపునకు సమష్టిగా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు భట్టు, మాజీ సర్పంచి రవీందర్, మాజీ ఎంపీటీసీ సభ్యుడు సతీష్, యాకయ్యతో పాటు పార్టీ నేతలు, అధికారులున్నారు.

కలిసికట్టుగా పని చేస్తే విజయం

నర్సింహులపేట: వర్గవిభేదాలు పక్కన పెట్టి రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం కలిసికట్టుగా పనిచేయాలని ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే రాంచంద్రునాయక్ కార్యకర్తలను కోరారు. నర్సింహులపేటలోని ఓ వేడుకల మందిరంలో నిర్వహించిన మండల కాంగ్రెస్ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడిని చూసి రాజకీయాలు నేర్చుకోవాలన్నారు. కేసీఆర్ మూడోసారి ఓడిపోవడమే మంచిదని.. లేనిపక్షంలో శ్రీలంకలో జరిగిన తీరులోనే ఇక్కడ భారాస వాళ్లకు పట్టేదన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు జినుకల రమేష్, గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు కడుదుల రామకృష్ణ తదితరులున్నారు.



దంతాలపల్లిలో కల్యాణలక్ష్మి లబ్ధిదారులతో ఎమ్మెల్యే రామచంద్రునాయక్

'పాలసీ'ల పోలీసు!

నెల్లికుదురు, న్యూస్‌టుడే: జిల్లాలోని తొర్రూరు సబ్ డివిజన్‌లో పని చేస్తున్న ఓ నిఘా విభాగం అధికారి బెదిరింపులకు పాల్పడుతూ ఓ ప్రైవేట్ సంస్థలో బీమా పాలసీలు చేయిస్తున్నట్లు గురువారం జిల్లాలో ప్రచారం జరిగింది. కొంతకాలంగా అక్కడే పని చేస్తున్న ఆ అధికారికి పరిచయాలు పెరగడంతో అదే ఆసరాగా చేసుకొని బీమా చేయిస్తున్నట్లు ఆరోపణలున్నాయి. గ్రామాల్లో జరిగే కార్యక్రమాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాల్సిన నిఘా విభాగం అధికారి ప్రభుత్వ వాహనంలో ప్రైవేటు సంస్థల వ్యక్తులతో తిరుగుతూ అక్రమ దందాలు చేస్తున్న వారి వద్దకు వెళ్లి బెదిరిస్తూ బీమా కట్టిస్తున్నట్లు సామాజిక మాధ్యమాల్లో గురువారం వైరల్‌గా మారింది.

రవాణా సేవల్లో డీడీల హైరానా!

దళారులను ఆశ్రయిస్తేనే పని.. ఎనుమాముల మార్కెట్ ప్రాంతానికి చెందిన సూర్య టాటాఏస్ వాహనానికి సరైన పత్రాలు లేకపోవడంతో ఇటీవల భూపాలపల్లి జిల్లాలో సీజ్ చేసి కేసు నమోదు చేశారు. పట్టుబడిన వాహనాన్ని విడిపించుకునేందుకు వరంగల్ ఆర్టీఏ కార్యాలయానికి రాగా రూ.7,225 జరిమానా విధించారు. ఈ మొత్తం డీడీ రూపంలో చెల్లించేందుకు బ్యాంకుల చుట్టూ తిరిగినా.. ఫలితం లేకపోవడంతో కార్యాలయం పరిసరాల్లోని దళారిని ఆశ్రయించాడు. ఒక డీడీలో ఈ మొత్తం లేక పోవడంతో రెండు డీడీలు ఇచ్చాడు. ఒక డీడీకి రూ.200 చొప్పున రూ.400 అదనంగా చెల్లించాల్సి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలా దళారీ లేనిదే డీడీ పని కావడం లేదు. డీడీల బదులు అంతర్జాలంలో రుసుం చెల్లించేలా చూడాలని వాహనదారులు కోరుతున్నారు. –రంగశాయిపేట, న్యూస్‌టుడే


వరంగల్ ఆర్టీఏ కార్యాలయం

రవాణాశాఖ కార్యాలయాల్లో డీడీ(డిమాండ్ డ్రాఫ్ట్) ద్వారా చెల్లింపులు చేయాలనే నిబంధన వాహనదారులకు ఇక్కట్లు తెచ్చిపెడుతోంది. నగదు రహిత ఆన్‌లైన్ సేవలకు అవకాశం ఉన్నా ఇప్పటికీ కొన్ని ఆఫ్‌లైన్‌లోనే కొనసాగుతున్నాయి. వీటిని అధిగమించాలంటే.. రవాణాశాఖ అంతర్జాల సేవలు మెరుగుపరచాలి.

ఇప్పటికే వాహనదారులు రుసుంలన్నీ మీసేవ, ఈ-సేవ, ఆన్‌లైన్ కేంద్రాల ద్వారా చెల్లిస్తున్నారు. ముందస్తు స్లాట్ విధానం సైతం అంతర్జాలంలోనే అమలు చేస్తున్నారు. మరిన్ని రుసుంలు సైతం చరవాణి సాయంతో ఫోన్ పే, గూగుల్ పే, ఇతర యాప్‌లతో చెల్లించేలా చూడాలి. లేదంటే రవాణాశాఖ ఆన్‌లైన్ సర్వీస్ ద్వారా నేరుగా దరఖాస్తుదారుడి చరవాణికి ఎస్ఎంఎస్ పంపించేలా మార్పులు చేయాలి. కార్యాలయాల్లో దరఖాస్తు నంబరును నిక్షిప్తం చేస్తే స్కానర్ వచ్చేలా ఏర్పాట్లు చేయాలని కోరుతున్నారు. ఈ విధానం ఇప్పటికే ఆంధ్రప్రదేశ్‌లో అమలు చేస్తున్నారు.

ఆందోళన

బ్యాంకుల్లో తప్పని ఇక్కట్లు

వాహనదారులు రుసుంలు, చెల్లింపులు డీడీల రూపంలో చెల్లించేందుకు ఇబ్బందులు పడుతున్నారు. డీడీల కోసం బ్యాంకుల కోసం వెతకాల్సిన పరిస్థితి. బ్యాంకు వరకు వెళ్లాక ఖాతాదారుడికే డీడీలు ఇస్తామని నిబంధన పెట్టడంతో తలపట్టుకుంటున్నారు. గతంలో నేరుగా ఇచ్చేవారు. నూతన విధానంతో వాహనదారులు నానా తంటాలు పడుతున్నారు. దూర ప్రాంతాల నుంచి వచ్చే తమకు ఖాతాలు ఎలా ఉంటాయని వాపోతున్నారు.



చేతివాటం ప్రదర్శిస్తున్న దళారులు

ఇదే అదనుగా దళారులు చేతివాటం ప్రదర్శిస్తున్నారు. వాహనదారులకు అవసరమైన డీడీలను దళారులు నిల్వ చేసి ఎక్కువ మొత్తంలో విక్రయిస్తున్నారు. పనులు తొందరగా ముగించుకోవాలనే దృక్పథంతో కార్యాలయాల పరిసరాల్లో ఉన్న దళారులను ఆశ్రయించడంతో చెప్పినంత అదనంగా చెల్లించి తీసుకోవాల్సిన పరిస్థితి ఉంది. లేదంటే వచ్చిన పని మరో రోజుకు వాయిదా పడుతుంది. బ్యాంకర్ల కొత్త నిబంధనలతో దళారులకు పంట పండుతుంది.

సమయం వృథా..

వాహన పన్నులు, జరిమానాలు, ఇతర రాష్ట్రాల వాహనాల మార్పు, ఇతర కేసులు నమోదు చేసిన సమయంలో చెల్లించాల్సిన రుసుంలన్నీ డీడీల రూపంలోనే కార్యాలయాల్లో తీసుకుంటున్నారు. వీటిని ఆన్‌లైన్‌లో డీడీ నంబరు, బ్యాంకు పేరు, ఇతర వివరాలు నమోదు చేస్తారు. వచ్చిన డీడీలను ప్రతిరోజు ఓ వ్యక్తి ట్రెజరీలో జమ చేయాల్సి ఉంటుంది. దీంతె చాలా సమయం వృథా అవుతోంది.

ఉమ్మడి జిల్లాలో ప్రతిరోజు జరిగే వాహనాల రిజిస్ట్రేషన్లు, కార్యాలయానికి వచ్చే డీడీల సంఖ్య వివరాలు (సుమారుగా)

జిల్లా	రిజిస్ట్రేషన్లు	డీడీలు
హనుమకొండ	70	40
వరంగల్	60	30
జనగామ	40	25
మహబూబాబాద్	45	25
భూపాలపల్లి	30	20
ములుగు	30	20

రెండు నెలల్లో మార్పులు వస్తాయి

- పుప్పాల శ్రీనివాస్ రవాణాశాఖ ఉప కమిషనర్



రవాణాశాఖ కార్యాలయాల్లో మరో రెండు నెలల్లో సమగ్ర మార్పులు వస్తాయి. వాహనదారులు ఎదుర్కొంటున్న డీడీల సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి చాలా సార్లు తీసుకెళ్లాం. సాంకేతిక పరమైన మార్పులు, డిజిటలైజేషన్ ప్రక్రియపై ప్రణాళిక చేస్తున్నారు. త్వరలోనే అమలు చేసేందుకు కసరత్తులు జరుగుతున్నాయి.

ఇదీ నేపథ్యం.. వరంగల్ జిల్లా గీసుకొండ, సంగెం మండలాల పరిధిలోని శాయంపేట హవేలీ, స్టేషన్ చింతలపల్లి గ్రామాల్లో కాకతీయ మెగా జౌళి వస్త్ర పరిశ్రమకు 2017 అక్టోబరు 22న అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ శంకుస్థాపన చేశారు. అందుకోసం రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ పారిశ్రామిక మౌలిక వసతుల సంస్థ (టీజీఐఐసీ) ద్వారా 1350 ఎకరాల భూమిని సేకరించింది. ప్రాజెక్టు వ్యయం రూ.1150.47 కోట్లు. ఇప్పటి వరకు ప్రభుత్వం ఇందులో మౌలిక సదుపాయాల కోసం రూ.706.87 కోట్లను ఖర్చు చేసింది. ప్రధానంగా భూసేకరణకు రూ.159.27 కోట్లు, ఇతర మౌలిక సదుపాయాలకు రూ. 547 కోట్లను వెచ్చించారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే లక్ష మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉద్యోగ ఉపాధి అవకాశాలు లభిస్తాయనేది అంచనా.

కాకతీయకు కైటెక్స్ కళ!

పరకాల, గీసుకొండ, న్యూస్‌టుడే

● డిసెంబరులో వస్త్ర పరిశ్రమ ప్రారంభానికి సన్నాహాలు

వరంగల్ ఉమ్మడి జిల్లాకు తలమానికంగా నిలుస్తున్న కాకతీయ మెగా జౌళి టెక్స్‌టైల్ పార్కులో త్వరలో మరో వస్త్ర పరిశ్రమ ప్రారంభం కాబోతోంది. దుస్తుల తయారీ సంస్థల్లో పేరు పొందిన 'కైటెక్స్' పనులు చివరి దశకు చేరుకున్నాయి. డిసెంబరు మొదటి వారంలో ప్రారంభించడానికి సన్నాహాలు జరుగుతున్నాయి.


కాకతీయ వస్త్రపరిశ్రమలో కైటెక్స్ కంపెనీ నెలకొల్పిన యూనిట్లు

ఇప్పటి వరకు మూడు పరిశ్రమలు..

వస్త్రపరిశ్రమకు శంకుస్థాపన చేసి ఏడేళ్లలో ఇప్పటి వరకు మూడు పరిశ్రమలు యూనిట్లను స్థాపించాయి. గణేష్ ఎకోటెక్, యంగ్‌వన్‌తోపాటు కైటెక్స్ ముందుకొచ్చాయి.

● ఉత్తరప్రదేశ్ కేంద్రంగా పని చేస్తున్న గణేష్ ఎకోటెక్ సంస్థ మొదటిసారిగా 50 ఎకరాల భూమిని తీసుకుని రూ. 500 కోట్ల పెట్టుబడితో రెండు యూనిట్లను ప్రారంభించింది. ఇక్కడ దేశంలోనే మొదటిసారిగా ప్లాస్టిక్ ఖాళీ సీసాలతో దారం తయారు చేసే పరిశ్రమను నెలకొల్పారు. దీని వల్ల 600 మంది ఉపాధి పొందుతున్నారు.

● దక్షిణ కొరియా దేశానికి చెందిన ప్రముఖ యంగ్‌వన్ సంస్థ క్రీడా దుస్తుల పరిశ్రమ నెలకొల్పడానికి ఎవర్‌టాప్ టెక్స్‌టైల్ అండ్ కాన్సెప్ట్ ప్రైవేట్ లిమిటెడ్ పేరుతో వస్త్రపరిశ్రమలో 297 ఎకరాల భూమిని తీసుకుంది. ఈ సంస్థ రూ.1000 కోట్ల పెట్టుబడి పెడుతోంది. 11 వేల మందికి ఉద్యోగ ఉపాధి అవకాశాలు వస్తాయని అంటున్నారు. ప్రస్తుతం ఒక షెడ్డును ఏర్పాటు చేసి 70 మంది మహిళలకు కుట్టుపై శిక్షణ ఇస్తున్నారు. సూరత్, బీవండి తదితర ప్రాంతాలకు వలస వెళ్లిన చేనేత కార్మికుల కోసం వస్త్ర పరిశ్రమలో యూనిట్లు నెలకొల్పడానికి ప్రభుత్వం 52 ఎకరాల భూమిని కేటాయించింది.

ఆనందం

చిన్న పిల్లల దుస్తుల తయారీ ఇక్కడే..

కేరళ కేంద్రంగా ఉన్న కైటెక్స్ సంస్థ చిన్నపిల్లల దుస్తుల తయారీ పరిశ్రమను నెలకొల్పుతోంది. ఈ కంపెనీకి 187.24 ఎకరాల భూమిని కేటాయించారు. ఇది పరిశ్రమ స్థాపనకు రూ. 1200 కోట్లను వెచ్చిస్తోంది. అవసరమైన షెడ్లను నిర్మించి దుస్తుల తయారీకి కావాల్సిన యంత్రాలను అమర్చుతున్నారు. పనులు దాదాపు 90 శాతం పూర్తయ్యాయి. ఇది పూర్తయితే 11 వేల మందికి ఉద్యోగ ఉపాధి అవకాశాలు లభిస్తాయని ఆ కంపెనీ ప్రతినిధులు చెబుతున్నారు. తొలుత వెయ్యి మందికి ఉపాధి కల్పించాలని చూస్తున్నారు. జూన్ 29న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వస్త్ర పరిశ్రమను సందర్శించగా ఇదే కైటెక్స్ కంపెనీలో వన మహోత్సవాన్ని ప్రారంభించారు.

సృజన వీచిక.. ఆవిష్కరణలకు వేదిక


భూపాలపల్లిలో తరగతి గదిలో విద్యార్థులు

SCHOOL INNOVATION MARATHON

న్యూస్‌టుడే, భూపాలపల్లి

ఉపాధ్యాయుల భాగస్వామ్యంతో విద్యార్థులు చిన్న వయసులో ప్రాజెక్టుల రూపకల్పన చేసేలా కేంద్ర ప్రభుత్వం, విద్యా శాఖ 'స్కూల్ ఇన్నోవేషన్ మారథాన్' అనే కార్యక్రమం చేపట్టాయి.. భావి శాస్త్రవేత్తలుగా ఎదిగేందుకు ఇదో చక్కటి అవకాశం.. 2024-25 సంవత్సరానికి ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. నీతి ఆయోగ్, ఏటీఏఎల్ ఇన్నోవేషన్ మిషన్, యూనిసెఫ్, కేంద్ర ప్రభుత్వం పరిధిలోని ఇన్నోవేషన్ విభాగం, ఏఐసీటీఈ సహకారంతో ఈ కార్యక్రమాన్ని రూపొందించారు. దీనిపై ఇప్పటికే జిల్లాల సైన్సు అధికారులకు, ప్రభుత్వ పాఠశాలల హెచ్ఎంలకు, సైన్సు ఉపాధ్యాయులకు అవగాహన కల్పించారు. విద్యార్థులు శాస్త్రవేత్తలుగా ఎదిగేందుకు ఇది ఎంతో దోహదపడుతుందని భూపాలపల్లి జిల్లా సైన్సు అధికారి బి.స్వామి తెలిపారు.

జనవరిలో విజేతల ప్రకటన: నవంబరు 30 నాటికి ప్రాజెక్టుల రూపకల్పన చేసి దరఖాస్తుల ప్రక్రియ పూర్తి చేయాలి. వాటిని పరిశీలించి 2025 జనవరిలో వెయ్యి మంది విజేతలను ప్రకటిస్తారు. వచ్చే మే నెలలో విజేతలకు బహుమతులు అందిస్తారు. జులై 29న దేశవ్యాప్తంగా నిర్వహించే అతిపెద్ద 'ఇన్నోవేషన్ షో'లో పాల్గొనాల్సి ఉంటుంది. ఈ పోటీల్లో ప్రతి రాష్ట్రం నుంచి 20 బృందాలను విజేతలుగా ప్రకటిస్తారు. ఇంకా 20 బృందాలు ప్రభుత్వ పాఠశాలల నుంచి, 20 బృందాలు ఉమ్మడి జిల్లా నుంచి, ప్రత్యేక అవసరాల పిల్లలకు సంబంధించి 20 బృందాలను ఎంపిక చేయనున్నారు. భూపాలపల్లి డీఈవో రాజేందర్ మాట్లాడుతూ.. ఎక్కువ సంఖ్యలో విద్యార్థులు పాల్గొనేలా హెచ్ఎంలు, సైన్సు అధికారులు ప్రోత్సహించాలని చెప్పారు.

అవకాశం

ఎవరికి అవకాశం..?: ఉమ్మడి వరంగల్ జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల్లో చదువుకుంటున్న విద్యార్థుల్లో 6వ తరగతి నుంచి ఇంటర్ చదువుతున్న విద్యార్థులందరికీ అవకాశం ఉంటుంది. ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధిలోని ఆరు జిల్లాల్లో మొత్తం 3,328 వరకు ప్రభుత్వ పాఠశాలలు ఉండగా, 85కు పైగా ఇంటర్ కళాశాలలు ఉన్నాయి. 6 నుంచి 10 తరగతి వరకు 2.41 లక్షల మంది, ఇంటర్‌లో 12 వేలకు పైగా విద్యార్థులున్నారు. ఒక్కో పాఠశాల నుంచి బృందంగా విద్యార్థులు ప్రాజెక్టుల రూపకల్పన చేయాలి. ఇద్దరు లేక ముగ్గురు మాత్రమే బృందంలో ఉండాలి. schoolinnovation-marathon.org అనే వెబ్‌సైట్‌లో వివరాలు నమోదు చేస్తే.. విద్యార్థులు, ఉపాధ్యాయునికి ఎంట్రీ కోర్సు నిర్వహిస్తారు. తర్వాత వారి ఆలోచనలు అందులో పొందుపర్చాల్సి ఉంటుంది. అయితే ప్రాజెక్టుల రూపకల్పన ఏవిధంగా ఉండాలంటే.. సమకాలీన సమాజం ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కారం చూపేలా ఉండాలి. ఇప్పటికే పరిష్కారం కనుగొని ఉంటే.. ఇంకా మెరుగైన పరిష్కారాలు సూచించాలి. ఎంపికైన విద్యార్థులకు కేంద్ర మంత్రిత్వ శాఖ నుంచి ప్రత్యేక బహుమతులు, ఉన్నత విద్యకు సహకారం అందనుంది.

'స్కిల్ డెవలప్‌మెంట్' సభ్యురాలిగా ఎంపీ కావ్య

రంగంపేట, న్యూస్‌టుడే: భారత పార్లమెంటరీ వ్యవహారాల శాఖ ఏర్పాటు చేసిన స్కిల్ డెవలప్‌మెంట్ పార్లమెంటరీ కమిటీ సభ్యురాలిగా వరంగల్ ఎంపీ డా. కడియం కావ్య ఎంపికయ్యారు. రాష్ట్రంలో స్కిల్ డెవలప్‌మెంట్ కోసం తనవంతు ప్రయత్నం చేస్తానని ఎంపీ కావ్య గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

పెచ్చులూడుతున్న పెద్దాసుపత్రి!



వైద్యపరంగా ఉత్తర తెలంగాణ ప్రజలకు పెద్ద దిక్కు అయిన ఎంజీఎం ఆసుపత్రి సమస్యలతో కొట్టుమిట్టాడుతోంది. నిత్యం రోగులతో సందడిగా ఉండే ఆసుపత్రిలో పలు వార్డుల్లో పెచ్చులూడిపడుతున్నాయి. ఏ క్షణంలో మీద పడతాయో తెలియని పరిస్థితి. ఉమ్మడి వరంగల్ జిల్లాతో పాటు రాష్ట్రంలో చాలా ప్రాంతాల నుంచి రోగులు ఇక్కడికి వస్తుంటారు. సుదూర ప్రాంతం నుంచి వచ్చినవారు ఇక్కడి పరిస్థితి చూసి ఒకింత ఆశ్చర్యానికి గురవుతున్నారు. వైద్య సేవల సంగతి పక్కన పెడితే.. వసతి, సౌకర్యాలు తీసికట్టుగా ఉండటంపై అసహనం వ్యక్తం చేస్తున్నారు. కొన్నిచోట్ల మరమ్మతులు చేసినా.. సమస్య మళ్లీ మొదటికొచ్చింది. పెచ్చులూడి స్లాబులోని ఇనుప చువ్వలు బయటకు కనిపిస్తున్నాయి. వర్షాలు పడినప్పుడు గోడలు చెమ్మతో మరింత బలహీన పడుతున్నాయి. గత వారం ఓ వార్డులో పెచ్చులూడి కిందపడగా.. త్రుటిలో ప్రమాదం తప్పింది.

– ఈనాడు, హనుమకొండ, న్యూస్‌టుడే, ఎంజీఎం ఆసుపత్రి


పురుషుల కొత్త(న్యూ మేల్) మెడికల్ వార్డు వద్ద


ఖైదీల వార్డుకి వెళ్లే దారిలో..



కిచెన్ కాంప్లెక్స్ మార్గంలో..


మహిళల మెడికల్ వార్డు వైపు..


ఆర్ఎంఓ కార్యాలయం వద్ద..


173 క్వింటాళ్ల రాయితీ బియ్యం పట్టివేత


పీడీఎస్ బియ్యం స్వాధీనం చేసుకున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు

వరంగల్‌క్రైం, న్యూస్‌టుడే: ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా పేదలకు అందించాల్సిన రాయితీ బియ్యం అక్రమంగా నిల్వ ఉంచిన కేంద్రాలపై గురువారం టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడి చేశారు. మొత్తం రూ. 4. 48 లక్షల విలువైన 173 క్వింటాళ్ల బియ్యం స్వాధీనం చేసుకున్నారు. టాస్క్‌ఫోర్స్ ఏసీపీ ఎ. మధుసూదన్ కథనం మేరకు... పరకాలకు చెందిన బి. రఘు చుట్టపక్కల గ్రామాల నుంచి తక్కువ ధరకు రాయితీ బియ్యం కొనుగోలు చేసి జ్యోతి రైస్‌మిల్లులో నిల్వ ఉంచినట్లు టాస్క్‌ఫోర్స్ అధికారులకు సమాచారం ఇచ్చింది. దీంతో తనిఖీ నిర్వహించి 60 క్వింటాళ్ల బియ్యం స్వాధీనం చేసుకున్నారు. అలాగే గీసుగొండ మండలం కొమ్మాల గ్రామానికి చెందిన జె. వేణు మారుతి మల్టీటెక్ రైస్ మిల్లులో రాయితీ బియ్యం ఉన్నట్లు సమాచారం రావడంతో తనిఖీ చేసి 95 క్వింటాళ్లు, మడికొండ మండలం అమ్మవారిపేట శివారుల్లోని రాజేశ్‌కు చెందిన మహాలక్ష్మి కోళ్ల ఫారంలో 18 క్వింటాళ్ల బియ్యం స్వాధీనం చేసుకున్నారు.

వైద్య విద్యార్థులను పరిశోధనల వైపు మళ్లించడానికి 'క్రితి' సదస్సు

● కేఎంసీలో రెండురోజుల పాటు ప్రత్యేక కార్యక్రమాలు



మాట్లాడుతున్న కేఎంసీ ప్రిన్సిపల్ డా.రాంకుమార్‌రెడ్డి, క్రితి సదస్సు కన్వీనర్ డా.సుజిత్ ఆర్ పున్నం, డా.వేణుజి బత్తిని, జూనియర్ వైద్యులు

ఎంజీఎం ఆసుపత్రి, న్యూస్‌టుడే: ఈ నెల 25, 26 తేదీల్లో కాకతీయ మెడికల్ కాలేజీ(కేఎంసీ)లోని ఎన్ఆర్ఐ భవనంలో కాకతీయ రీసెర్చ్ ఇన్షియేటివ్ ఫర్ ట్రాన్స్‌ఫర్మేటివ్ ఇన్నోవేషన్స్(క్రితి) పేరిట కాకతీయ పరిశోధన దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు కేఎంసీ యూఎస్ఏ అల్యూమిని, 'క్రితి' సదస్సు కన్వీనర్ డా. సుజిత్ ఆర్ పున్నం, డాక్టర్ వేణు జి. బత్తిని తెలిపారు. గురువారం కేఎంసీలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ప్రిన్సిపల్ డా. రాంకుమార్‌రెడ్డితో కలసి వారు పరిశోధన కార్యక్రమాలకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. అండర్ గ్రాడ్యుయేట్, పీజీ విద్యార్థులను క్లినికల్ వైద్యంతో పాటు పరిశోధన వైపు మళ్లించడానికి రాష్ట్రంలోనే మొదటిసారి ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇందులో పాల్గొనడానికి దేశ నలుమూలల నుంచి 1000 మందికిపైగా విద్యార్థులు రిజిస్ట్రేషన్ చేసుకున్నారన్నారు. దక్షిణ భారత దేశంలోనే అత్యధిక పారితోషికం రూ. 3 లక్షలతో పాటు పరిశోధనలో అభిరుచి ఉన్న విద్యార్థులను ప్రోత్సహించనున్నట్లు పేర్కొన్నారు.

తొమ్మిదిరకాల పోటీలు..: అండర్ గ్రాడ్యుయేట్, పోస్టుగ్రాడ్యుయేట్ విద్యార్థులకు ఉద్దేశించిన 9రకాల పోటీలు ఇందులో ఉంటాయన్నారు. 350 మందికి పైగా విద్యార్థులు తుదిపోటీల్లో ప్రతిష్ఠాత్మక సత్కారాల కోసం పోటీపడతారన్నారు. రెండురోజుల పాటు సాగే కార్యక్రమంలో ఈ నెల 25న మొదటిరోజు డిబేట్, హ్యాకథాన్, జెపార్డీ(ఇండియాలోనే అతిపెద్ద మెడ్‌క్విజ్), రెండోరోజు ఈ నెల 26న పేపర్ ప్రజెంటేషన్, పోస్టర్ ప్రజెంటేషన్, సింపోజియం పోటీలు ఉంటాయన్నారు. ముఖ్య అతిథులుగా కాళోజీ ఆరోగ్య విశ్వవిద్యాలయం ఉపకులపతి డా. కరుణాకర్‌రెడ్డి, రిజిస్ట్రార్ డా. సంధ్య, కేఎంసీ ప్రిన్సిపల్ డా. రాంకుమార్‌రెడ్డి, ఎంజీఎం సూపరింటెండెంట్ డాక్టర్ చిలుక మురళి, ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు డా. కాళీప్రసాదరావు, ఏపీపీఐ అధ్యక్షుడు డా. సతీష్‌కతులా హాజరవుతారన్నారు. సమావేశంలో క్రితి కేఎంసీ విద్యార్థుల విభాగం ప్రతినిధులు డా. శశాంక్, రోహిత్, వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.

చికెన్ ధరలు

(కిలో వెల రూపాయలలో)

వెన్‌కాబ్

ఫాం:	120
రిటైల్:	142
డ్రెస్డ్:	206
స్కిన్‌లెస్:	234

కిట్స్ విద్యార్థులకు రూ.14 లక్షల ప్యాకేజీ


ఉద్యోగ నియామక పత్రాన్ని అందజేస్తున్న ప్రిన్సిపల్ కె.అశోక్‌రెడ్డి

భీమారం, న్యూస్‌టుడే: హసన్‌పర్తి మండలం భీమారంలోని కిట్స్ ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు ఒరాకిల్ సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఏడాదికి రూ. 14 లక్షల ప్యాకేజీతో ఉద్యోగాలకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపల్ కె. అశోక్‌రెడ్డి గురువారం తెలిపారు. సీఎస్ఈ విభాగానికి చెందిన ఆకాశ్ పున్నం, సీఎస్ఎం చివరి సంవత్సరం చదువుతున్న రాకేశ్ మామిడి ఒరాకిల్ సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఇటీవల మూడు దశల్లో జరిగిన ఇంటర్వ్యూలో పాల్గొని ఉద్యోగాలను సాధించినట్లు పేర్కొన్నారు. గురువారం కంపెనీ ప్రతినిధులు పంపిన నియామక పత్రాలను ప్రిన్సిపల్, అధ్యాపకులు విద్యార్థులకు అందజేసి అభినందించారు.

పురపాలికలకు 15వ ఆర్థిక సంఘం నిధులు

జనగామ, న్యూస్‌టుడే: నిధుల లేమితో కొట్టుమిట్టాడుతున్న పురపాలికలకు ఉపశమనం లభించనుంది. 15వ ఆర్థిక సంఘం అన్‌టైడ్(బేసిక్) గ్రాంటు కింద నిధులను కేటాయించారు. నాన్‌మిలియన్ ప్లస్ పట్టణాల కేటగిరీలో 2023-24కు సంబంధించి రెండో విడత నిధులను విడుదల చేస్తూ పురపాలక శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. వీటిని వేతనాలు, నిర్వహణ ఖర్చులకు వినియోగించడానికి వీలు లేదని స్పష్టం చేశారు. కనీస సౌకర్యాల కల్పన, పారిశుద్ధ్య అవసరాల కోసం వస్తు సామగ్రి, వాహనాల కొనుగోలుకు వీటిని వినియోగించాల్సి ఉంటుంది. గతంలో విడుదలైన నిధులు, వినియోగం తదితర అంశాలకు సంబంధించి వివరాలను సమర్పించాలి. ఉమ్మడి జిల్లాలోని వరంగల్ కార్పొరేషన్, 9 పురపాలికలకు మొత్తం రూ. 97863789 మంజూరయ్యాయి.

ఉమ్మడి వరంగల్ జిల్లాలో వివరాలు (రూ.లలో)

పురపాలిక	విడుదలైన నిధులు
వరంగల్(కా.)	70120849
జనగామ	4421374
భూపాలపల్లి	5247185
పరకాల	2301994
డోర్నకల్	1224600
మహబూబాబాద్	6062481
మరిపెడ	1544914
తొర్రూరు	2062493
నర్సంపేట	3266607
వర్ధన్నపేట	1611292


పెద్దవంగరలో..


నర్సింహులపేటలో


దంతాలపల్లిలో


మరిపెడలో

పోలీసుల ద్విచక్రవాహన ప్రదర్శన

న్యూస్‌టుడే బృందం: ప్రజారక్షణ విధుల్లో ప్రాణాలు సైతం పణంగా పెట్టి శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేసిన పోలీసు అమరులను స్మరించుకోవాల్సిన అవసరం ఉందని పోలీసు అధికారులు పేర్కొన్నారు. అమరవీరుల సంస్మరణ వారోత్సవాల సందర్భంగా జిల్లాలోని మరిపెడ, పెద్దవంగర, నర్సింహులపేట, దంతాలపల్లి, నెల్లికుదురు తదితర మండల కేంద్రాల్లో గురువారం ద్విచక్రవాహన ప్రదర్శన నిర్వహించారు. ఆయా ప్రాంతాల్లో పోలీసు అధికారులు, ప్రజలు, యువత పాల్గొన్నారు.


నెల్లికుదురులో

మేమున్నాం.. మీకు తోడుగా

మహబూబాబాద్ టౌన్: 98859 29762,
మహబూబాబాద్: 9441084123, తొర్రూరు టౌన్: 97019 14499
డోర్నకల్: 94405 15786, మరిపెడ: 80085 74823

మహబూబాబాద్ టౌన్, న్యూస్‌టుడే: పట్టణంలోని నూర్‌మసీదు వీధికి వారం రోజులుగా చెత్త సేకరణవాహనం రావడం లేదు. వ్యర్థాలన్నీ పేరుకుపోయాయి. **- జానీమియా**

సమాధానం: చెత్త సేకరణవాహనం, సిబ్బందిని పంపించి వ్యర్థాలను తొలగించేలా చర్యలు తీసుకుంటాం. **- తోట రాజేష్, శానిటరీ ఇన్‌స్పెక్టర్**

మహబూబాబాద్ టౌన్: తీగలసత్యనారాయణ కాలనీ రహదారిలో పైపులైను లీకేజీ ఏర్పడి పది రోజులుగా నీరంతా వృథాగా పోతుంది. **- సురేష్**

సమాధానం: మరమ్మతు చేయిస్తాం. **- డౌలాగర్ స్వాతి, 26వ వార్డు కౌన్సిలర్.**

స్పందనకు వందనం

వీధి దీపాలకు మరమ్మతు

తొర్రూరు, న్యూస్‌టుడే: డివిజన్ కేంద్రంలోని బస్టాండ్ నుంచి పెద్దచెరువుకు వెళ్లేరోడ్డులో వీధి దీపాలు వెలగడం లేదని సమస్యను 'న్యూస్‌టుడే' మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లింది. వారు స్పందించి సిబ్బందితో మరమ్మతు చేయించారు.

నడకబాట శుభ్రం

డోర్నకల్, న్యూస్‌టుడే: డోర్నకల్‌లో బ్రాహ్మణ కుంట సమీపంలోని ఆవాసాల వద్ద గల నడక బాటను సిబ్బంది గురువారం శుభ్రం చేశారు.

వ్యర్థాల తొలగింపు..

మహబూబాబాద్ టౌన్, న్యూస్‌టుడే: ముత్యాలమ్మ ఆలయం నుంచి కంకరబోడు మంచినీటి సంపుహౌజ్ వరకు గల ప్రధాన రహదారిలో వ్యర్థాలు పేరుకుపోయాయని బుధవారం 'ఈనాడు'లో ప్రచురితమైన వార్తకు శానిటరీఇన్‌స్పెక్టర్ తోట రాజేష్ స్పందించారు. సిబ్బందితో రహదారిని శుభ్రం చేయించారు.

26 నుంచి బ్యాడ్మింటన్ పోటీలు

నర్సింహులపేట, న్యూస్‌టుడే: పోలీస్ అమర వీరుల సంస్మరణ వారోత్సవాల సందర్భంగా తొర్రూర్ సర్కిల్ పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 26, 27 తేదీల్లో తొర్రూరు పోలీస్‌స్టేషన్‌లో డివిజన్ స్థాయి బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించనున్నట్లు ఎస్సై మాలోతు సురేష్ అన్నారు. డివిజన్ స్థాయి బ్యాడ్మింటన్ డబుల్స్ పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. క్రీడాకారులు ఈ నెల 25లోగా పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు 94932 58369, 96034 88573, నంబర్లలో సంప్రదించాలన్నారు.

26న ధర్మయుద్ధ మహాసభ

మహబూబాబాద్ టౌన్, న్యూస్‌టుడే: ఈనెల 26న వరంగల్‌లో నిర్వహించే మాదిగల ధర్మ యుద్ధ మహాసభను జయప్రదం చేయాలని ఎమ్మార్పీఎస్ జాతీయ, రాష్ట్ర అధికార ప్రతినిధులు బొడ్డ విక్రమ్‌మాదిగ, బుర్రి సతీష్‌మాదిగ కోరారు. మంద కృష్ణమాదిగ ఆదేశం మేరకు పట్టణంలో ఎమ్మార్పీఎస్, ఎమ్మెస్పీ అనుబంధ సంఘాల జిల్లా, మండల కమిటీల ముఖ్య నాయకుల సమావేశంలో వారు మాట్లాడారు.

25న మహాధర్నా

మహబూబాబాద్, న్యూస్‌టుడే: పురపాలక సంఘంలో విధులు నిర్వహిస్తున్న కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 25న హైదరాబాద్‌లోని సీడీఎంఏ కార్యాలయం వద్ద నిర్వహించనున్న మహాధర్నాకు కార్మికులు అధిక సంఖ్యలో తరలిరావాలని సీఐటీయూ పట్టణ కార్యదర్శి కుమ్మరికుంట్ల నాగన్న కార్మికులను కోరారు. గురువారం ఉదయం పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో ఉన్న కార్మికుల అడ్డా వద్ద నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడారు.

బోనస్ అందించాలని వినతి

కొత్తగూడ, న్యూస్‌టుడే: ఏజెన్సీ మండల రైతులకు ఇచ్చిన హామీ ప్రకారం రైతులు పండించిన పంటకు క్వింటాలుకు రూ. 500 బోనస్ అందించాలని అఖిల భారత ప్రగతిశీల రైతు సంఘం మహబూబాబాద్ జిల్లా అధ్యక్షుడు పూణెం ప్రభాకర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం కొత్తగూడ తహసీల్దార్‌ను కలిసి వినతి పత్రం అందించారు.


చిన్నగూడూరులో


నెల్లికుదురులో

రెవెన్యూ అధికారుల నిరసన

నెల్లికుదురు, చిన్నగూడూరు, నర్సింహులపేట, న్యూస్‌టుడే: ఇసుక అక్రమ రవాణాను అడ్డుకోబోయిన తహసీల్దార్ కె.రాజు, రెవెన్యూ ఉద్యోగులపై దాడికి యత్నించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ జిల్లాలోని చిన్నగూడూరు, నెల్లికుదురు, నర్సింహులపేట తహసీల్దారు కార్యాలయాల ఎదుట రెవెన్యూ సిబ్బంది గురువారం నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన ప్రదర్శన చేపట్టారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆయా మండలాల తహసీల్దార్లు, సిబ్బంది ఉన్నారు.


నర్సింహులపేటలో

సాహితీవేత్త 'దార్ల' మృతి


దార్ల రామచంద్ర

మానుకోట, న్యూస్‌టుడే: జిల్లా కేంద్రానికి చెందిన కథారచయిత, కవి, విశ్రాంత అధ్యాపకుడు దార్ల రామచంద్ర (66) గురువారం అనారోగ్యంతో మరణించారు. డోర్నకల్ మండలం గొల్లచర్లలో జన్మించిన ఆయన సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల్లో తెలుగు అధ్యాపకుడిగా పని చేసి వైస్ ప్రిన్సిపల్‌గా 2016లో పదవీ విరమణ చేశారు. ఆయనకు భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. సామాజిక ఉద్యమాల్లోనూ పనిచేసిన ఆయన గత రెండున్నర దశాబ్దాలుగా పలు రచనలు చేశారు. 2001లో వెలువరించిన కథాసంకలం 'కిర్రు చెప్పులు' ఆయనకు సామాజిక చైతన్య కథారచయితగా గుర్తింపు తెచ్చింది. మా ఊరు కవితా సంకలనం, చంద్రహాస ఖడ్గం నానీలు, పాట మా ప్రాణం సామాజిక గేయాలు, తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమ కాలంలో రాసిన విధ్వంసపు ఆనవాళ్లు కవితా సంకలం ఆయన ప్రధాన రచనలు. వివిధ సాహితీ సంస్థల నుంచి పురస్కారాలను అందుకున్నారు. దళిత, బహుజన రచయితల, కవుల, మేధావుల ఐక్యవేదిక తదితర సాహిత్య సంస్థల్లో చురుకుగా పనిచేశారు. రచయితలు సయ్యద్ ఖుర్షీద్, మద్దెర్ల రమేశ్, రాంనర్సయ్య, కోమాకుల సీతారాములు, బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి శివరాజ్ ఇంకా పలువురు కవులు,రచయితలు, సాహితీ వేత్తలు ఆయన మృతిపట్ల సంతాపం ప్రకటించారు.

నిరుపేద విద్యార్థినికి వైద్యవిద్యలో సీటు



కురవి, న్యూస్‌టుడే: ప్రతిభకు పేదరికం అడ్డు కాదని కురవి మండలం నల్లెల్ల గ్రామానికి చెందిన అక్కినపల్లి మానస నిరూపించారు.. గ్రామానికి చెందిన అక్కినపల్లి కృష్ణ, సైదమ్మ దంపతులది పేద కుటుంబం. చేపలు విక్రయిస్తేనే గాని పూట గడవదు. ఎన్నో కష్టాలకు ఓర్చి ఆ దంపతులు తమ కుమార్తె మానసను చదివించారు. మానుకోటలోని ప్రైవేటు బడిలో నాలుగోతరగతి వరకు చదువుకున్న మానస తరువాత కురవిలోని గిరిజన ఏకలవ్య గురుకులంలో పదోతరగతి వరకు చదివారు. 2021లో 9.7 జీపీఏతో ఉత్తీర్ణత సాధించారు. ఇంటర్మీడియట్ మహబూబాబాద్‌లోని ఓ ప్రైవేటు కళాశాలలో 2023లో బైపీసీ పూర్తి చేశారు. హైదరాబాద్‌లో ఏడాది పాటు నీట్ పరీక్షకు శిక్షణ తీసుకొన్నారు. ఇటీవల వెల్లడైన నీట్ ఫలితాల్లో ఉత్తమ ర్యాంకు సాధించి వరంగల్‌లో సీటు దక్కించుకున్నారు. పేద కుటుంబం నుంచి వైద్యవిద్యలో ప్రవేశార్హత సాధించడంపై స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

బడికి 'దారి' మరిచారు..!

ఏళ్లుగా పొలం గట్టుపై రాకపోకలు



కేసముద్రం, న్యూస్‌టుడే: కేసముద్రం మండలంలోని ధర్మారం తండా ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు పొలం గట్టే బడి బాటగా మారింది. ఈ పాఠశాలలో 13 మంది విద్యార్థులుండగా ఇద్దరు ఉపాధ్యాయులు పని చేస్తున్నారు. అంగన్‌వాడీ కేంద్రాన్ని కూడా బడిలోనే నిర్వహిస్తుండగా ఐదుగురు పిల్లలున్నారు. తండాకు చెందిన ఓ వ్యక్తి 25 ఏళ్ల కిందట సుమారు రెండు గుంటల భూమిని దానంగా ఇవ్వగా ఆ స్థలంలో పాఠశాలను నిర్మించారు. తండా నుంచి 40 మీటర్లు దూరంలో ఉన్న ఈ బడికి బాట లేదు. విద్యార్థులు ఉపాధ్యాయులు సుమారు 25 ఏళ్లుగా పొలం గట్టుపై నుంచే పాఠశాలకు వెళ్తున్నారు. జాతీయ ఎస్టీ కమిటీ సభ్యుడు జాటోతు హుస్సేన్ నాయక్ గురువారం ఎక్స్ వేదికగా ఈ విషయంపై స్పందించారు. పాఠశాల నిర్మించినప్పుడే దారి ఎందుకు ఏర్పాటు చేయలేదని ప్రశ్నించారు. విద్యార్థులు చదువుకుంటున్న పాఠశాలపై ఇంత నిర్లక్ష్యంగా వ్యవహరించడం ఏమిటని ప్రశ్నించారు.

బాధిత కుటుంబ సభ్యులకు పరామర్శ


జైసింగ్‌నాయక్‌ను పరామర్శిస్తున్న మాజీ మంత్రి దయాకర్‌రావు

తొర్రూరు, న్యూస్‌టుడే: మండంలోని హరిపిరాలలో భారాస సీనియర్ నాయకుడు చంద్రమౌళి ఇటీవల మృతి చెందగా, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు కుటుంబ సభ్యులను గురువారం పరామర్శించి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం డివిజన్ కేంద్రంలోని దుబ్బ తండాకు చెందిన జైసింగ్‌నాయక్ కంటిశస్త్ర చికిత్స చేయించుకోవడంతో ఆయన యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. జడ్పీటీసీ మాజీ సభ్యుడు శ్రీనివాస్, భారాస మండలాధ్యక్షుడు సీతారాములు, నాయకులు డాక్టర్ సోమేశ్వరరావు, శ్రీనివాసరావు, ప్రదీప్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత

తొర్రూరు, న్యూస్‌టుడే: డివిజన్ కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా స్వచ్ఛభారత్ కార్యక్రమం చేపట్టారు. కళాశాల ఆవరణలో ఉన్న పిచ్చిమొక్కలు, ప్లాస్టిక్ వ్యర్థాలను శుభ్రం చేశారు. కళాశాల ప్రిన్సిపల్ బి.రాములు మాట్లాడుతూ.. పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత అన్నారు. అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

ఉపాధి కల్పనలో విఫలం

డోర్నకల్, న్యూస్‌టుడే: జిల్లాలో నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పనలో ప్రభుత్వం విఫలమైందని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు జి.నాగయ్య పేర్కొన్నారు. డోర్నకల్‌లో వచ్చే నెల 16, 17 తేదీల్లో జరిగే పార్టీ జిల్లా మహాసభల సన్నాహక సమావేశంలో గురువారం ఆయన మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజల బాగుగోలు పట్టించుకోవడం లేదన్నారు. పార్టీ జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్, నాయకులు వెంకన్న, శ్రీనివాస్, అశోక్, నవాబ్ తదితరులు పాల్గొన్నారు

రెండో రోజు ఉపవాస దీక్ష

మహబూబాబాద్ రూరల్(గూడూరు) న్యూస్‌టుడే: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ గూడూరులోని అంబేడ్కర్ కూడలిలో భారాస నేతలు చేపట్టిన ఉపవాస దీక్ష రెండోరోజు గురువారం కొనసాగింది. మాజీ శాసన సభ్యుడు బానోతు శంకర్ నాయక్ హాజరై సంఘీభావం తెలిపారు. పార్టీ మండల నేతలు పాల్గొన్నారు.

పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు

నర్సింహులపేట, న్యూస్‌టుడే: పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే రాంచంద్రునాయక్ అన్నారు. మండలంలోని పలు గ్రామాలకు చెందిన 54 మంది లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి చెక్కులను రైతు వేదికలో పంపిణీ చేశారు

నిత్యావసర సరకుల అందజేత

మరిపెడ, న్యూస్‌టుడే: జనవికాస స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో అనాథ వృద్ధులు, దివ్యాంగులకు నిత్యావసరాలు పంపిణీ చేశారు. అనాథ వృద్ధుల ఆదరణ కార్యక్రమంలో భాగంగా ముప్పై మందికి నిత్యావసర సరకులు, దుస్తులు అందజేశారు. సంస్థ ప్రతినిధులు, స్థానిక రాజకీయ, వ్యాపార ప్రముఖులు పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకోవాలి

కురవి, న్యూస్‌టుడే: ప్రభుత్వం అందిస్తున్న ఉచిత విద్యుత్తు పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని డీఈ విజయ్ అన్నారు. గురువారం కురవి మండలం రామచంద్రాపురంలో రైతుల పొలం బాట కార్యక్రమాన్ని చేపట్టారు. అధిక లోడు ఉన్నటువంటి విద్యుత్ నియంత్రికలు, ఎత్తు తక్కువ ఉన్న వాటిని మారుస్తున్నట్లు చెప్పారు. లైన్‌మెన్ వెంకటేశ్ రైతులు ఉన్నారు.

కుమురం భీం ఆశయసాధనకు కృషి

గంగారం, న్యూస్‌టుడే: గంగారంలోని కుమురంబీం వర్ధంతి కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. తుడుందెబ్బ రాష్ట్ర నాయకులు భూర్కయాదగిరి, తుడుందెబ్బ మండలాధ్యక్షుడు వెంకటరత్నం, ఆదివాసీ ఉపాధ్యాయ సంఘాల నాయకులు సువర్ణపాక పాపరావు, ముడిగ రాంచందర్, లక్ష్మీనర్సు, కాంగ్రెస్ యువజన నాయకుడు ముడిగ విజయ్‌కుమార్ తదితరులున్నారు.

సీసీ రహదారి నిర్మించరూ..

నెహ్రూసెంటర్, న్యూస్‌టుడే: పట్టణంలోని ఎన్జీవోస్ కాలనీ రెండో వీధిలో సీసీ రహదారి లేక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి కాలనీలో సీసీ రోడ్డు నిర్మించేలా చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు కోరుతున్నారు.

తాగునీటి సమస్య పరిష్కారం

మహబూబాబాద్, న్యూస్‌టుడే: పురపాలక సంఘం 23వ వార్డు పరిధిలోని ఫైర్‌స్టేషన్ కాలనీలో కొన్నేళ్లుగా స్థానికులు ఎదుర్కొంటున్న సమస్యకు పరిష్కారం లభించిందని స్థానిక వార్డు కౌన్సిలర్ మార్నేని శ్రీదేవి అన్నారు. 15వ ఆర్థిక సంఘం నిధులతో ఏర్పాటు చేసిన తాగునీటి సరఫరా పైపులైన్‌ను గురువారం శ్రీదేవి ప్రారంభించారు. కార్యక్రమంలో ఎం.దశరథం, ఎండీ.ఇక్బాల్, ఉమేష్, ఐలయ్య, సలీం, సరిత, సంధ్య పాల్గొన్నారు.

నకిలీ మందులు విక్రయిస్తే కఠిన చర్యలు

మరిపెడ, న్యూస్‌టుడే: నకిలీ, నాణ్యతలేని, నిషేధిత మందులు విక్రయిస్తే కఠిన చర్యలుంటాయని మరిపెడ వ్యవసాయ డివిజన్ ఏడీఏ విజయ్‌చంద్ర డీలర్లను హెచ్చరించారు. ఏడీఏ విజయ్‌చంద్ర నేతృత్వంలో మరిపెడ వ్యవసాయ డివిజన్ పరిధిలోని వ్యవసాయాధికారులు దుకాణాల్లో తనిఖీలు నిర్వహించారు. వ్యవసాయాధికారులు ఛాయారాజ్, నర్సింహారావు, వినయ్, శ్రీదేవి, బాస్కర్, వీరాసింగ్ పాల్గొన్నారు.

భూమిపూజ

నర్సింహులపేట, న్యూస్‌టుడే: దక్షిణ ఇండియా సంఘం (సీఎస్ఐ) డోర్నకల్ అధ్యక్ష మండలం నర్సింహులపేటలో నూతన పరిశుద్ధ సైఫన్ దేవాలయం (చర్చి) నిర్మాణానికి గురువారం బిషప్ డా.కె.పద్మారావు, స్త్రీల మైత్రి సంఘం అధ్యక్షురాలు విజయకుమారి భూమి పూజ చేశారు.

బకాయిలు విడుదల చేయాలని ధర్నా

మహబూబాబాద్ టౌన్, న్యూస్‌టుడే: విద్యార్థుల ఉపకార వేతనాలు, ఫీజు బకాయిలను వెంటనే విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా సమన్వయకర్త పట్ల మధు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులతో కలిసి కళాశాల గేటు ఎదుట నిరసన వ్యక్తం చేశారు.

హామీలు అమలు చేయాలి

చిన్నగూడూరు: రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు అల్వాల వీరయ్య అన్నారు. గురువారం మండలంలోని గుండంరాజుపల్లిలో ఏరియా కమిటీ సమావేశం కందుకూరి సుధాకర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో మాట్లాడారు.

మొక్కలు నాటిన దివ్యాంగుల తల్లులు


మహబూబాబాద్‌లో మొక్కలు నాటుతున్న దివ్యాంగుల తల్లులు

మహబూబాబాద్, న్యూస్‌టుడే: ప్రజాహృదయం స్వచ్ఛంద సేవాసంస్థ ఆధ్వర్యంలో లక్ష మొక్కలు నాటాలనే లక్ష్యంతో 'అమ్మ హరిత దీక్ష' కార్యక్రమం ప్రారంభించినట్లు ఆ సంస్థ వ్యవస్థాపకులు దైద వెంకన్న తెలిపారు. గురువారం స్థానిక దివ్యాంగుల సేవాకేంద్రంలో 16 మంది దివ్యాంగుల తల్లులతో వారి పేరిట మొక్కలు నాటారు. సేవా కేంద్రం నిర్వాహకుడు సైమన్, పాల్‌రాజ్, పీటర్ పాల్గొన్నారు.

ఏఎల్‌ఓ కార్యాలయం ఏర్పాటు చేయాలి

కేసముద్రం, న్యూస్‌టుడే: కేసముద్రంలో ఏఎల్‌ఓ కార్యాలయం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం మండల కేంద్రంలోని పులే కూడలిలో సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. పార్టీ మండల కార్యదర్శి గొడిశాల వెంకన్న మాట్లాడుతూ పారిశ్రామికంగా అభివృద్ధి చెందిన కేసముద్రంలో సహాయ కార్మిక కార్యాలయాన్ని ఏర్పాటు చేయాలన్నారు.

సహాయనిధి పథకం అమలు చేయాలి

మహబూబాబాద్ టౌన్: రాష్ట్ర ప్రభుత్వం అంబేడ్కర్ సహాయనిధి పథకం అమలు చేసి అర్హులైన ప్రతి దళిత కుటుంబానికి రూ.12 లక్షలు అందించాలని తెలంగాణ ఎమ్మార్పీఎస్ జాతీయకార్యదర్శి కొండ్ర ఎల్లయ్యమాదిగ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలోని కేటీఆర్ కాలనీలో ఎమ్మార్పీఎస్ జిల్లా, మండల కమిటీ ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు.

జావెలిన్ త్రోలో రజత పతకం

కొత్తగూడ, న్యూస్‌టుడే: మండలంలోని మోడల్ స్పోర్ట్స్ స్కూల్ (బాలుర) విద్యార్థి శివగణేష్, కోచ్ ధనజీలను గురువారం అభినందించారు. గుంటూరుజిల్లా నాగార్జున విశ్వవిద్యాలయంలో నిర్వహించిన 35వ సౌత్‌జోన్ జాతీయ పోటీల్లో జావెలిన్‌త్రో పోటీలో రజత పతకం సాధించాడు. పాఠశాల ఆవరణలో విద్యార్థి, శిక్షకుడ్ని ఉపాధ్యాయులు సన్మానించి అభినందించారు.

సంక్షిప్తంగా

స్వామివారి గరుడ వాహనసేవ



గార్ల, న్యూస్‌టుడే: బ్రహ్మోత్సవాలనంతరం శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామివారి ఉత్సవ విగ్రహాలను బుధవారంరాత్రి స్థానిక వేంకటేశ్వరస్వామి ఆలయానికి ఈవో సమత సమక్షంలో తీసుకువచ్చారు. గురువారం స్వామివారి ఉత్సవ విగ్రహాలతో వీధుల్లో గరుడ వాహనసేవను నిర్వహించారు.

విద్యుత్తు మీటర్లు విధిగా అమర్చుకోవాలి

నెల్లికుదురు, న్యూస్‌టుడే: గృహ విద్యుత్తు వినియోగదారులు విధిగా విద్యుత్తు మీటర్లను అమర్చుకోవాలని తొర్రూరు డీఈ మధుసూదన్ సూచించారు. మండలంలోని నర్సింహులగూడెం శివారు సుందర్‌తండాలో మునిగలవీడు ఏఈ భార్గవితో కలిసి, గురువారం ఆయా గ్రామాల్లో పర్యటించి, పలువురికి గృహజ్యోతి పథకంపై అవగాహన కల్పించారు. రూ.938 చెల్లిస్తే మీటర్లు అమర్చనున్నట్లు వివరించారు.

హామీల అమలుకు డిమాండ్


కస్తూర్బాలో ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్సీ నర్సిరెడ్డి

తొర్రూరు, దంతాలపల్లి, నర్సింహులపేట, న్యూస్‌టుడే: ఎమ్మెల్సీగా తనకు మరోసారి అవకాశం ఇవ్వాలని వరంగల్, ఖమ్మం, నల్గొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి కోరారు. గురువారం ఆయన దంతాలపల్లి, తొర్రూరు, నర్సింహులపేట మండలంలోని పలు జడ్పీ, ఆదర్శ, ఉన్నత పాఠశాలలు, కళాశాలల్లో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. తొర్రూరులో ఆయన మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలుచేయాలని డిమాండ్ చేశారు. ఉద్యోగులకు డీఏలు, జీపీఎఫ్, మెడికల్ రీయింబర్స్‌మెంట్ బిల్లులను వెంటనే చెల్లించాలన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ ప్రతినిధులు మురళీకృష్ణ, నాగమల్లయ్య, యాకయ్య, చైతన్య తదితరులు పాల్గొన్నారు. ఆయా ప్రాంతాల్లో సమాఖ్య మండల, జిల్లా బాధ్యులున్నారు.

బావిలో పడి వృద్ధుడి మృతి


భూక్య లాలు (పాత చిత్రం)

చిన్నగూడూరు, న్యూస్‌టుడే: పామాయిల్ తోటలో మధ్యాహ్నం వరకు కూలీలతో పని చేసి భోజనం చేసే ముందు కాళ్లు చేతులు కడుకునేందుకు బావిలోకి దిగిన వృద్ధుడు ప్రమాదవశాత్తు మునిగిపోయి మృతి చెందిన ఘటన చిన్నగూడూరు శివారు రామచంద్రుతండాలో గురువారం చోటు చేసుకుంది. స్థానికులు, బంధువులు తెలిపిన వివరాలు ఇలా.. మందారపు నర్సింహారావుకు 14 ఎకరాల పామాయిల్ తోట ఉంది. తొమ్మిదేళ్లుగా భూక్యలాలు (60) పాలేరుగా పని చేస్తున్నారు. తోటలో కూలీలను పెట్టి పనిచేయిస్తున్నారు. మధ్యాహ్నం అన్నం తినే సమయానికి బావిలోకి దిగిన భూక్యలాలు తిరిగి రాలేదు. కూలీలు వెళ్లి చూసే సరికి నీటిలో మునిగిపోయారు. నీళ్లలో గాలించినా దొరకలేదు. పోలీసు సిబ్బంది ఘటనాస్థలికి చేరుకొని బావిలోంచి మృతదేహాన్ని బయటకు తీసేందుకు మోటార్లు పెట్టి నీటిని తోడిస్తున్నట్లు ఎస్సై ఘూన్సీ తెలిపారు.

గుంతలో పడి ఒకరి..

గార్ల, న్యూస్‌టుడే: మర్రిగూడెం పంచాయతీలోని కొత్తతిర్లాపురానికి చెందిన మతిస్థిమితంలేని ఓ వ్యక్తి పొలం వద్ద కుంటలో ఉన్న లోతైన గుంతలోపడి మృతి చెందిన విషాద సంఘటన గురువారం జరిగింది. బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన సమాచారం ప్రకారం.. వి.రామన్న(27)కు బాల్యం నుంచి మతిస్థిమితంలేదు. కొత్తతిర్లాపురానికి సమీపంలోని పొలం వద్దకు వెళ్లిన అతను కుంటలో ఉన్న లోతైన గుంతలో పడిపోయాడు. సమీపంలో వ్యక్తి విషయాన్ని గ్రామస్థులకు తెలిపి అతడ్ని కాపాడేందుకు ప్రయత్నించినా అతడు మరణించాడు. తండ్రి సక్రూకు అయిదుగురు సంతానంలో మృతుడు చివరివాడు. జరిగిన ఈ సంఘటనతో కొత్తతిర్లాపురంలో విషాద ఛాయలు నెలకొన్నాయి.

త్రుటిలో తప్పిన ప్రమాదం

దంతాలపల్లి, న్యూస్‌టుడే: ఆటో రోడ్డు కిందకు దూసుకెళ్లిన ఘటనలో త్రుటిలో పెను ప్రమాదం తప్పింది. ఈ సంఘటన దంతాలపల్లి-సూర్యాపేట రహదారిపై కుమ్మరికుంట్ల శివారులో గురువారం చోటు చేసుకుంది. వేములపల్లికి వెళ్లిన ఆటో తొర్రూరుకు వస్తుండగా కుమ్మరికుంట్ల శివారులో అదుపుతప్పడంతో రోడ్డు కిందకు దూసుకెళ్లి పల్టీ కొట్టింది. డ్రైవర్ స్వల్ప గాయాలతో బయటపడ్డారు.

సీతంపేటలో ఉద్రిక్తత


పోలీసులతో వాగ్వాదం

గార్ల, న్యూస్‌టుడే: సీతంపేటలో ఈ నెల 20న ఒప్పంద కంప్యూటర్ ఆపరేటర్ గుమ్మడి మహేష్ అనుమానాస్పదస్థితిలో మృతి విచారణలో కొంత ఉద్రిక్తత నెలకొంది. మృతుడి సోదరుడు రాజు ఇంటి సమీపంలోని వారే హత్య చేసి ఉంటారని ఆరోపిస్తూ ఠాణాలో ఫిర్యాదు చేయగా విచారణలో భాగంగా ఆ కుటుంబసభ్యులను గురువారం పోలీసులు సీతంపేటకు తీసుకువచ్చారు. బాధిత కుటుంబ సభ్యులు, వర్గీయులు రావడంతో అక్కడ ఉద్రిక్త వాతావరణం చోటు చేసుకుంది. రేకుల షెడ్డు ధ్వంసం అయింది. పోలీసులతో వాగ్వాదానికి దిగారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండు చేశారు. పోలీసులు అధిక సంఖ్యలో మోహరించారు. ఎస్పీ సుధీర్ రామ్‌నాథ్ కేకన్ మాజీ ఎంపీటీసీ సభ్యురాలు నాగమణి, బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడి వారిని శాంతింపచేశారు. విచారణానంతరం బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఆరోపణలు ఎదుర్కొంటున్నవారిని ఆ ఇంటి నుంచి తీసుకెళ్తున్న క్రమంలో మృతుడి తరఫు వ్యక్తులు అడ్డుపడటంతో కొంతమేర ఉద్రిక్తత నెలకొంది. పోలీసులు భారీ బందోబస్తు మధ్య అనుమానితులను వాహనంలో తీసుకెళ్లారు.

అధికారుల సర్వే

డోర్నకల్, న్యూస్‌టుడే: డోర్నకల్‌లోని బంధం కుంటను అధికారులు గురువారం సర్వే చేశారు. ఇక్కడ సమ్మర్ స్టోరేజీ నిర్మాణం కోసమని 2009లో తన ఎకరం 17 గుంటల భూమిని వాడుకున్నారని, ఇప్పటిదాక పరిహారం చెల్లించలేదని రమణ హైకోర్టుని ఆశ్రయించగా కోర్టు ఆదేశానుసారం సర్వే చేపట్టారు. సంబంధిత శాఖ ఏడీఏ నర్సింహమూర్తి, నీటి పారుదల శాఖ డీఈఈ భద్రునాయక్ పర్యవేక్షించారు.

వెంచర్ల నిర్మాణాలపై అనుమతి తప్పనిసరి


వెంచర్‌ను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్‌టొప్పొ

తొర్రూరు, న్యూస్‌టుడే: అనుమతులు లేని వెంచర్లలో ప్లాట్లు కొనుగోలు చేయవద్దని, లేఅవుట్ నిబంధనలు పాటించకుండా నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు తప్పవని జిల్లా అదనపు కలెక్టర్ లెనిన్‌వత్సల్ టొప్పో హెచ్చరించారు. డివిజన్ కేంద్రంలోని కంఠాయపాలెం రోడ్డు నందున్న బృందావన ఎస్టేట్‌ను గురువారం ఆయన పరిశీలించి, మాట్లాడారు. అంతకుముందు గ్రంథాలయంలో స్టాక్ రిజిస్టర్‌ను పరిశీలించి, పాఠకులకు అందుతున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శాంతికుమార్, గ్రంథపాలకుడు శంకర్, ఎల్లయ్యతోపాటు సిబ్బంది పాల్గొన్నారు.